సాక్షి
గుంటూరు
బుధవారం । 23 । ఆగస్టు । 2023



నారసింహుడికి పూజలు

ఫిరంగిపురం: నుదురుపాడు శివారులోని లక్ష్మీ నారసింహస్వామికి మంగళవారం స్వాతి నక్షత్ర పూజలు చేశారు.



లక్ష విరజాజుల పూజ

పాత గుంటూరు: అరండల్‌పేటలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో శావణ మాసం తొలి మంగళవారం గోపూజ, లక్ష విరజాజుల పూజ నిర్వహించారు.



సుబ్రహ్మణ్యుని కల్యాణం

విజయవాడ: షష్టిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో మంగళవారం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం జరిగింది.

న్యూస్‌రీల్

నేడు, రేపు విజయసాయిరెడ్డి సమీక్షలు



నరసరావుపేట: రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి రెండు రోజులపాటు జిల్లాలో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీ కార్యాలయ వర్గాలు మంగళవారం పేర్కొన్నాయి. నరసరావుపేట ఏ–1 కన్వెన్షన్‌లో బుధ, గురువారాలలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ పరిశీలకులతో విజయసాయిరెడ్డి సమావేశమవుతారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ, స్థానిక పరిస్థితులపై చర్చిస్తారని ఎంపీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాసం తొలి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శ్రావణ మంగళ మహాగౌరిగా, అభయ ప్రదాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చంద్రయాన్–3 వీక్షణకు పాఠశాలల్లో ఏర్పాట్లు

పల్నాడు డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించేలా పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రయాన్–3 చంద్రుని ఉపరితలం దక్షిణ ధ్రువంపై 23న బుధవారం దిగనున్న నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. బుధవారం సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారాన్ని అందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వైద్యుల పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో పిల్లల వైద్యుల పోస్టులను భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు పిల్లల వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్హతలు, దరఖాస్తుఫాం, ఇతర వివరాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ చూడాలని వెల్లడించారు.

24న తెలుగు భాషా దినోత్సవంపై పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 24న గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, తెలుగు పద్యాలు, జానపద పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల వారీగా మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులను గురువారం ఉదయం 10 గంటలకు గుంటూరులో జరిగే పోటీలకు పంపేలా మండల విద్యాశాఖాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 118, బ్యాంక్ కెనాల్‌కు 1,279, తూర్పు కెనాల్‌కు 563, పశ్చిమ కెనాల్‌కు 129, నిజాంపట్నం కాలువకు 246, కొమ్మమూరు కాల్వకు 1,855 క్యూసెక్కులు విడుదల చేశారు.

రక్షితి రక్షితః

- లారీ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు నెత్తురోడుతూ రోడ్డుపై కొట్టుకుంటున్నాడు. ఆ దారిన వెళ్తున్న వారు గుర్తించినా దగ్గరకు వెళ్లే సాహసం చేయలేదు. చట్టపరమైన చిక్కులు వస్తాయేమోనని జంకారు. ఒకరు మాత్రం 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి ఆ వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లారు.. కానీ ఫలితం శూన్యం. అప్పటికే అతను చనిపోయాడు. కొంచెం ముందుగా తీసుకొచ్చి ఉంటే ప్రాణాలు నిలిచేవని వైద్యులు చెప్పారు. ప్రమాదాన్ని గమనించిన వారు వెంటనే ఆ వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తే అతడి ప్రాణాలు నిలిచేవి.
- ఇలాంటి ఘటనలు జరగకుండా ఇప్పుడు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రమాదాలు, ఇతర ఆపదలు సంభవించినప్పుడు ప్రాణాలు కాపాడే వారికి చట్టం ద్వారా రక్షణ కల్పించే చర్యలు చేపట్టింది. రక్షితి రక్షితః నినాదానికి సిసలైన అర్థం చెప్పింది. ప్రాణాలు కాపాడిన వ్యక్తులను గుడ్ సమరిటన్‌గా గుర్తించి పురస్కారాలు అందిస్తోంది.

– పట్నంబజారు(గుంటూరు ఈస్ట్)

- ఆపదలో అండగా నిలుద్దాం
- క్షతగాత్రులను కాపాడుదాం
- గుడ్ సమరిటన్‌గా మారదాం



హైవే ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

ఆదర్శ మానవతామూర్తులు

- గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామం కాలువ వద్ద ఈ ఏడాది మార్చిలో వీర్ల వెంకయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. దీనిని గుర్తించిన ముతుకూరి అనిల్‌కుమార్ వెంకయ్యను ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించారు. వెంకయ్య ప్రాణాలతో బయటపడ్డాడు.
- క్రోసూరు మండలం బయ్యవరం దాటిన తరువాత రాఘవేంద్ర అనే యువకుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ముప్పాళ్ళ మండలం రుద్రవరానికి చెందిన కొమ్మూరి శ్రీనివాసరావు రాఘవేంద్ర పరిస్థితిని గమనించి ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడారు.
- అనిల్‌కుమార్, శ్రీనివాసరావులను గుడ్ సమరిటన్లుగా గుర్తించిన జిల్లా రవాణా శాఖ అధికారులు వారికి అవార్డుల అందజేతకు ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

జిల్లాలో ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	1,047	431	913
2022	1,071	397	1,011
2023 (ఇప్పటివరకు)	474	146	393

చట్టమే కాపాడుతుంది..

నిత్యం జిల్లాలో సగటున 10 నుంచి 15 ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా లక్షా 9వేలకుపైగా వాహనాలు ఉన్నాయి. ప్రమాదాలు అధిక శాతం హైవేలపైనే జరుగుతున్నాయి. ప్రమాదాల్లో క్షతగాత్రులను కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం రక్షణగా నిలుస్తోంది. అంతేకాక గుడ్ సమరిటన్‌గా గుర్తించి నగదు ప్రోత్సాహం అందిస్తుంది. ఈ మేరకు 2020 సెప్టెంబర్‌లో మోటార్ వాహనాల చట్టాన్ని మార్చింది. క్షతగాత్రులను కాపాడిన వారిని ఎటువంటి ఇబ్బందులకూ గురి చేయకూడదని స్పష్టంగా పేర్కొంది. రక్షించిన వ్యక్తిని గుడ్ సమరిటన్‌గా గుర్తించి రూ.ఐదువేల నగదు ప్రోత్సాహం అందించేలా ప్రత్యేక జీఓను జారీ చేసింది. దీనిలో భాగంగానే ఈ ఏడాది గుంటూరు జిల్లానుంచి ఇద్దరిని గుడ్ సమరిటన్లుగా రవాణాశాఖ అధికారులు ఎంపిక చేశారు. గుడ్ సమరిటన్ ఎంపికకు జిల్లా స్థాయిలో కమిటీ ఉంటుంది. దీనిలో కలెక్టర్, ఎస్పీ, డీఎంహెచ్‌ఓ, డీటీసీ సభ్యులుగా ఉంటారు.

''గోల్డెన్ అవర్'' కీలకం

ప్రమాదంలో గాయపడిన తర్వాత మొదటి గంట సేపు క్షతగాత్రునికి కీలకం. ఈ సమయాన్ని గోల్డెన్ అవర్‌గా వైద్యులు పరిగణిస్తారు. గంటలో ఆ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పిస్తే ప్రాణాపాయం తప్పుతుంది. దీనిని మనందరం గుర్తుంచుకోవాలి. క్షతగాత్రులను కాపాడదాం.. మానవత్వం చాటుదాం.

ఆపదలో ఆదుకోండి..



ఆపదల్లో క్షతగాత్రులను ఆదుకుంటే చట్టపరంగా ఎటువంటి సమస్యలూ ఎదురుకావు. ఇప్పటికే గుడ్ సమరిటన్ గురించి అవగాహన సదస్సులు నిర్వహించటంతోపాటు, జిల్లా వ్యాప్తంగా పోస్టర్ల ద్వారా ప్రచారం చేపట్టాం. ఒక మనిషి ప్రాణం కాపాడటం ద్వారా ఒక కుటుంబానికి ఎంతో మేలు చేసిన వారమవుతాం.

– షేక్ కరీం, డీటీసీ, గుంటూరు జిల్లా

లోకేష్ పిల్లకాకి

- చంద్రబాబు బీసీల ద్రోహి
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజం

సత్తెనపల్లి: లోకేష్ పిల్లకాకి అని, ఓనమాలు కూడా రాని పప్పు అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. మంగళవారం సత్తెనపల్లి వచ్చిన ఆయన ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. బీసీలకు చంద్రబాబు చేసిందేమీ లేదని, కనీసం ఒక్క బీసీ నేతనైనా రాజ్యసభకు పంపించారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. 136 కులాలను గుర్తించి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతోందని చెప్పారు. చంద్రబాబు నాయుడు మూడు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసినా బీసీలను గుర్తించారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్.కృష్ణయ్య, పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణారావు, బీద రవిమస్తాన్‌రావును రాజ్యసభకు పంపించామని స్పష్టం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే వాడుకున్నారని మండిపడ్డారు. అసలు టీడీపీ నేతలకు బీసీల గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగిస్తున్నామని, దీనిని కూడా టీడీపీ రాద్ధాంతం చేయడం సిగ్గు చేటని విమర్శించారు. చంద్రబాబు బీసీ ద్రోహి అని, ఆయన తన మామ ఎన్టీఆర్ పార్టీని, సైకిల్ గుర్తును ఎలా లాక్కున్నారో అందరికీ తెలుసని కారుమూరి విమర్శించారు. చంద్రబాబు నాయుడికి మతి భ్రమించిందని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్ యాత్రలతోనే వర్షాలు కూడా పారిపోతున్నాయని ఎద్దేవా చేశారు.

గ్రూప్–1 ఉద్యోగానికి తప్పుడు ధ్రువపత్రం

నిందితుడిపై కేసు నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్

విజయవాడ స్పోర్ట్స్: ఏపీపీఎస్సీ–2022 నోటిఫికేషన్‌లోని గ్రూప్–1 ఉద్యోగానికి తప్పుడు ధ్రువపత్రం అందజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సౌత్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ తెలిపారు. ఈ కేసు వివరాలను సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకరులకు వెల్లడించారు. సౌత్ ఏసీపీ కథనం మేరకు.. గ్రూప్–1 ఉద్యోగాల భర్తీలో భాగంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు 2023 ఆగస్టు రెండు నుంచి 11వ తేదీ వరకు కమిషన్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. అదే నెల పదో తేదీన అన్నమయ్య జిల్లా మందనపల్లి మండలం గుండవనపల్లి గ్రామానికి చెందిన ఎ.లోకేష్ ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. లోకేష్ విజయవాడ జీజీహెచ్ నుంచి తాను 167.7 సెంటీమీటర్లు ఎత్తు ఉన్నట్లు పొందిన సర్టిఫికెట్‌ను కమిషన్‌కు అందజేశారు. అనుమానం వచ్చిన కమిషన్ మరో సారి అతని ఎత్తును నిర్ధారించాలని విజయవాడ జీజీహెచ్‌కు పంపించింది. రెండో దఫా వైద్య పరీక్షల్లో అతని ఎత్తు 167 సెంటీమీటర్ల కంటే తక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ రెండు సర్టిఫికెట్లకు పొంతన లేకపోవడంతో లోకేష్ ఎత్తును నిర్ధారించే బాధ్యతలను పోలీసు, లీగల్ మెట్రాలజీ అధికారులకు అప్పగించారు. ఈ పరీక్షల్లోనూ లోకేష్ ఎత్తు 167 సెంటీమీటర్ల కంటే తక్కువగా ఉన్నట్లు నిర్ధారణైంది. తప్పుడు ధ్రువ పత్రం అందజేసి ప్రభుత్వం ఉద్యోగం పొందేందుకు ప్రయత్నించిన నిందితుడు లోకేష్‌పై కమిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీ మాల్‌ప్రాక్టీస్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు.



స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

నైపుణ్యసిద్ధి

- నిరుద్యోగ యువతకు దిక్సూచి వినుకొండ ఏపీ స్కిల్ హబ్
- ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా ఉచిత శిక్షణలు
- ఇతర జిల్లాల నుంచీ వస్తున్న యువకులు
- ఇప్పటికే 80మందికిపైగా ఉపాధి అవకాశాలు



ఉద్యోగం పొందిన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వినుకొండలో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్(శిక్షణసంస్థ) సత్ఫలితాలనిస్తోంది. స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తోంది. గత ఏడాది అక్టోబరులో ప్రారంభమైన ఈ సంస్థలో శిక్షణకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే కాకుండా ప్రకాశం జిల్లా నుంచి నిరుద్యోగ యువత తరలివస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ తర్ఫీదు పొందిన వారిలో 80 మంది ఉపాధి అవకాశాలు పొందడం విశేషం.

అందుబాటులో ఉన్న కోర్సులివే..

- డేటా ఎంట్రీ, డొమిస్టిక్ డేటా ఎంట్రీ
- ట్యాలీ, అకౌంట్స్
- బ్యూటీషియన్

సర్టిఫికెట్లు జారీ

ఇక్కడ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు జారీ చేయడంతోపాటు ఉద్యోగ అవకాశాలనూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చూపిస్తోంది. దీనికోసం ప్రభుత్వ, ప్రైవేటు, బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. శిక్షణ తీసుకున్న అనంతరం అభ్యర్థులకు ఉచితంగా సామగ్రి కూడా శిక్షణసంస్థ నిర్వాహకులు అందిస్తున్నారు.

నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి



గత ఏడాది నుంచి వినుకొండ గంగినేని కళ్యాణి డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. ఇప్పటివరకు నాలుగు బ్యాచ్‌లు శిక్షణ పొందాయి.

– ఎస్‌కే జానీబాషా, ట్రైనింగ్ సెంటర్ కో–ఆర్డినేటర్

అవకాశాలు చూపించడం శుభసూచికం



వినుకొండలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్ ద్వారా ట్యాలీ, డొమిస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు నేర్చుకుంటున్నాను. ప్రభుత్వం ద్వారా ఇచ్చే శిక్షణ సర్టిఫికెట్‌కు మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వమే ఉద్యోగావకాశాలు కల్పిస్తుండటం శుభసూచికం.

– బెల్లంకొండ అపర్ణ, కొప్పుకొండ

డేటా ఎంట్రీ నేర్చుకుంటున్నా



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీఎస్ఎస్‌డీసీ సెంటర్‌లో డేటాఎంట్రీ కోర్సు నేర్చుకుంటున్నా. ఈ కోర్సు పూర్తయితే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది. డిగ్రీతో పాటు స్వల్పకాలిక కోర్సులు నేర్చుకున్నట్లయితే బ్యాంకింగ్ రంగంలోనూ ఉద్యోగాలు పొందవచ్చు.

– అన్నా ప్రసన్నాంజనేయులు, వినుకొండ

దూరవిద్యకు ఓపెన్ స్కూల్

- ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి
- వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ట్రైనీ కలెక్టర్, విద్యాశాఖ అధికారులు



నరసరావుపేట: చదువుకు దూరమైన వారికి ఓపెన్ స్కూల్ వరంలాంటిదని ట్రైనీ కలెక్టర్ కేఎస్ కల్పశ్రీ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఎన్‌రోల్‌మెంట్‌పై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పూర్తిచేసేందుకు మంచి సదవకాశమన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా చదివినా సర్టిఫికెట్లకు రెగ్యులర్‌గా పరిగణిస్తారని వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మాట్లాడుతూ ఈ ఏడాది 2023–24 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లలో ఏపీ ఓపెన్ స్కూలులో ప్రవేశంపొందగోరువారు ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయాలు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ నమోదుకోసం www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అపరాధ రుసుంలేకుండా ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం ఏపీ సార్వత్రిక విద్యాపీఠం పోస్టర్లను ఆవిష్కరించారు.

జీజీహెచ్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రిలోని 24 గంటల ల్యాబ్, మానసిక వైద్య విభాగం, లీగల్ ఎయిడ్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమోళీశ్వరి మంగళవారం సందర్శించారు. 24 గంటల ల్యాబ్‌లో అందుతున్న సేవల గురించి రోగుల సహాయకులను ఆమె అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ల్యాబ్ ఫలితాలు అందుతున్నాయని చెప్పారు. లీగల్ ఎయిడ్ సెంటర్ పనివిధానంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయమూర్తి వెంట అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్లాది వెంకటకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్ ఉన్నారు.

రైల్వే భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

రైల్వే ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్పీఎఫ్ ఐజీ అరోమాసింగ్ ఠాకూర్



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైల్వేస్టేషన్‌లో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని రైల్వే ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్పీఎఫ్ ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ సూచించారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లోని ఆర్పీఎఫ్ స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రయాణికుల భద్రత కోసమే ఉందన్నారు. రైల్వే స్టేషన్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తుపదార్థాల సరఫరాపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. అరోమాసింగ్ ఠాకూర్‌ను గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభా దూకుడు

- జాతీయ స్థాయిలో రాణిస్తున్న హై జంపర్
- పార్ట్‌టైం జాబ్ చేస్తూనే క్రీడా సాధన
- ఆదుకుంటే అదరగొడతానంటున్న షేక్ మొహిద్దీన్



హైజంప్ సాధన చేస్తున్న షేక్ మొహిద్దీన్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రతిభతో ముందుకు దూకుతున్నారు ఆ హైజంపర్. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. అచంచల ఆత్మ విశ్వాసంతో క్రీడా సాధన చేస్తున్నారు. పార్ట్‌టైం జాబ్ చేస్తూనే రాణిస్తున్నారు. ఇటీవల లక్నోలో జరిగిన ఖేలో ఇండియా నేషనల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకుని తన సత్తాచాటారు షేక్ మొహిద్దీన్.

పేద కుటుంబం

మొహిద్దీన్‌ది కాకుమాను మండలం రేటూరు గ్రామం. తండ్రి షేక్ షంషుద్దీన్ పదేళ్ల క్రితం మరణించారు. తల్లి నూర్జహాన్ గృహిణి. ఇంటి వద్దే పాలవ్యాపారం చేస్తున్నారు. మొహిద్దీన్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబానికి బాసటగా నిలిస్తున్నారు. ఇద్దరక్కలు పెళ్లిళ్లై వెళ్లిపోయారు. ప్రస్తుతం మొహిద్దీన్ ఇంటి వద్ద పాలు పోస్తూనే గుంటూరులో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నారు. రాత్రి వరకు హైజంప్ సాధన చేస్తున్నారు.

పోటీకి వెళితే పతకమే

హైజంప్ వైవిధ్యమైన క్రీడ. పోటీ తక్కువగా ఉన్నా, సాధనలో తేడా వస్తే వైకల్యం సంభవించే అవకాశం ఉంది. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన మొహిద్దీన్ ఏ పోటీలకు వెళ్లినా పతకం సాధించి తీసుకొస్తున్నారు. ఇప్పటివరకు 20కుపైగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని 10 బంగారు, మరో 10 రజత, కాంస్య పతకాలు సాధించారు. ఏడుసార్లు జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. అన్నింటా ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పూర్తిగా సాధనలో నిమగ్నమైతే దేశానికి అతి త్వరలోనే ప్రాతినిధ్యం వహించే అవకాశముందని అతని శిక్షకులు అంటున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వీలు కావడంలేదు.

స్పాన్సర్‌షిప్ ఇప్పించండి



ఖేలో ఇండియా నేషనల్స్‌లో కూడా 2.06 మీటర్ల ఎత్తు జంప్ చేశాను. ఇది బెస్ట్ మీట్ రికార్డ్. అందుకే కాంస్య పతకం వచ్చింది. సాధన, పోటీల్లో పాల్గొనేందుకు స్పాన్సర్‌షిప్ ఇప్పించాలని మనవి. ఇటీవల శాప్ పెద్దలను కలిశాను. ఒక్క ఏడాది మనస్సుపెట్టి సాధన చేస్తే తప్పకుండా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాను. హైజంప్‌కు నా దేహం చాలా బాగా సహకరిస్తుందని జాతీయస్థాయి శిక్షకులూ చెప్పారు. ఎప్పటికైనా ఈ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరిక.

– షేక్ మొహిద్దీన్, నేషనల్ హైజంపర్.

క్లుప్తంగా

యార్డుకు 39,306 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 39,306 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 38,009 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,465 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

తెలుగు భాషా క్విజ్‌ను జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే క్విజ్ (ప్రశ్నావళి, రాత పరీక్ష) పోటీలకు తెలుగు భాషా నైపుణ్యం గల విద్యార్థిని పాఠశాల నుంచి పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాలలోని పాఠశాలలు 8,9,10 తరగతుల నుంచి భాషా నైపుణ్యం గల ఒక్క విద్యార్థిని పంపాలని వివరించారు. ఈనెల 24వ తేదిన నియోజకవర్గం స్థాయి పోటీలు, 26వ తేదిన జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులను బృందంగా ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ జిల్లాస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో పోటీలు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ (నరసరావుపేట), ఆర్‌వీఎస్ అండ్ సీవీఎస్ హైస్కూల్ (చిలకలూరిపేట), సరస్వతీ శిశు మందిర్, సతైనపల్లి (పెదకూరపాడు), జెడ్పీ బాలికోన్నత పాఠశాల (సతైనపల్లి), ప్రభుత్వ ఉన్నతపాఠశాల (గురజాల), జెడ్పీ బాలుర ఉన్నతపాఠశాల (మాచర్ల), ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (వినుకొండ)లో నిర్వహిస్తారని వివరించారు.

బాధ్యతగా పనిచేసి మాతృమరణాలను నివారించాలి

- మాతృమరణాల నివారణే తక్షణ కర్తవ్యం
- గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరువెస్ట్: మహిళల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తోందని, అధికారులు మరింత బాధ్యతగా పనిచేసి మాతృ మరణాలను నివారించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాతృ మరణాలపై సమీక్ష సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు నుదురుపాడు, మంగళగిరి, పెదనందిపాడు, పొన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐదుగురు గర్భిణులు మరణించారన్నారు. ఇబ్బందులను, సమస్యలను పరిశీలించుకుని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. నిర్లక్ష్యం కారణంగా ఏ ఒక్కరి ఆరోగ్యానికిగాని, ప్రాణానికిగాని ఇబ్బంది అయితే కఠిన చర్యలు తప్పవన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు, సుఖ ప్రసవానికి ప్రభుత్వం అనేక పథకాలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. గ్రామస్థాయిలో వీటిపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు అత్తింటి నుంచి పుట్టింటికి ప్రసవానికి వెళ్లేటప్పుడు సమీప ప్రాంతంలోని పీహెచ్‌సీకి సమాచారం అందించాలన్నారు. అక్కడ చికిత్స కంటిన్యూ చేసుకోవాలని సూచించారు. గర్భందాల్చిన 3వ నెల నుంచి వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స పొందాలని, హైరిస్క్ ఉన్న గర్భిణులకు ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ప్రసవానికి ముందుగానే ప్రభుత్వాసుపత్రికి తరలించాలన్నారు. దీనికి ఉచిత రవాణా సేవలు కూడా కల్పించామన్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జె.హనుమంతరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ ఎన్.జయరామకృష్ణ, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి డాక్టర్ రత్న మన్ మోహన్, ఐసీడీఎస్ మనోరంజని, జీజీహెచ్ గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించాలి

జిల్లా పంచాయతీరాజ్ ఈఈ హరేరామ కృష్ణ


మాట్లాడుతున్న ఈఈ హరేరామ కృష్ణ

చెరుకుపల్లి: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల జిల్లా పంచాయతీరాజ్ ఈఈ హరేరామ కృష్ణ కాంట్రాక్టర్లకు సూచించారు. మండల పరిధిలోని రాజవోలు, చెరుకుపల్లిలలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలను ఆయన మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో భవన నిర్మాణాలపై సమీక్షించారు. ఈఈ హరేరామకృష్ణ మాట్లాడుతూ మండలంలో నిర్మిస్తున్న 17 సచివాలయాలకుగాను ఐదు ప్రారంభం కాగా 12 వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. 15 రైతు భరోసా కేంద్రాలకుగాను నాలుగు ప్రారంభం కాగా 11 వివిధ దశల్లో ఉన్నాయని, 12 హెల్త్ క్లినిక్ సెంటర్లకుగాను 3 ప్రారంభమయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణాలపై కూడా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేపల్లె పంచాయతీరాజ్ డీఈ ఎంఎస్ఎస్ ప్రసాద్, ఏఈ షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: స్నేహితుడి భార్యపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సాలిపేట భిక్షావతి బజారుకు చెందిన యువకుడు శ్రీనివాస్ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పని చేసేవాడు. అక్కడ చెంచుపేట అమరావతి ఫ్లాట్స్‌కు చెందిన వివాహితుడు పరిచయం అయ్యాడు. అతనితో కలసి అమరావతి ఫ్లాట్స్‌లోని ఇంటికి వెళుతుండేవాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం స్నేహితుడి భార్యపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన త్రీ టౌన్ పోలీసులు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ముగిసిన తెలుగు పరిచయం కోర్సు



మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగును శ్రద్ధగా వినడం, తెలుగువారితో స్నేహం చేయడం ద్వారా ఆ భాషను సులభంగా నేర్చుకోవచ్చని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు పరిచయం కోర్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. 48 రోజులుగా ఏజీ (ఆడిట్) కార్యాలయం ఉద్యోగులకు తెలుగు భాష పరిచయం శిక్షణ తరగతులను నిర్వహించామన్నారు. తుది పరీక్షలో ఉత్తీర్ణులైన ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. ఇక్కడ నేర్చుకున్న తెలుగును సాధన చేయాలని సూచించారు.

బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా 'మణిపాల్'

డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి


అవార్డు అందుకుంటున్న మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌కు అసోచామ్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అవార్డు లభించిందని మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ దేశంలోని పురాతన అపెక్స్ చాంబర్ అసోసియేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) ఇన్నోవేషన్ అండ్ సస్టైనబుల్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఆరోగ్య రంగాన్ని మెరుగుపరచడం, భవిష్యత్‌లో ఆరోగ్య సంరక్షణ అనే అంశంపై న్యూఢిల్లీలో జరిగిన 2వ హెల్త్‌కేర్ సమ్మిట్ అండ్ అవార్డు 2023 కార్యక్రమంలో మణిపాల్ హాస్పిటల్‌కు ప్రతిష్టాత్మక బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అవార్డును అందుకుందని తెలిపారు. ఈ అవార్డు హాస్పిటల్ వైద్య నిపుణులు సిబ్బంది యొక్క అలుపెరుగని సేవలకు గుర్తింపు అన్నారు. తనతో పాటు హెచ్‌ఓడీ ఫైనాన్స్ రామాంజనేయరెడ్డి, హెచ్‌ఓడీ శ్రీదేవి, మార్కెటింగ్ హెచ్‌ఓడీ శ్రీరామ్ చక్రవర్తిలు అవార్డును అందుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వందనా తల్వార్, మెడికల్ సూపరింటెండెంట్ (నూఢిల్లీ) డాక్టర్ ఆశిష్ చౌదరి, కో చైర్ పర్సన్ అసోచామ్ పద్మశ్రీ ప్రొఫెసర్ డాక్టర్ డి.యస్. రాణా, అసోచామ్ చైర్ పర్సన్ నేషనల్ హెల్త్ కేర్ పుష్పా విజయరాఘవన్ పాల్గొన్నారని ఆయన వివరించారు.

నిషేధిత సిగరెట్లు పట్టివేత

రూ.6.77 లక్షల విలువైన సరకు స్వాధీనం


సిగరెట్ పెట్టెలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు

నగరంపాలెం: అనుమతుల్లేని, నిషేధిత సిగరెట్లు విక్రయించే వ్యాపారులపై గుంటూరు విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసులు నమోదుకు ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు రీజినల్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం పల్నాడు జిల్లా మాచర్లలో అక్రమంగా అనుమతుల్లేని, నిషేధించిన సిగరెట్లను విక్రయిస్తున్నారనే సమాచారంతో పలు ప్రాంతాల్లోని రెండు కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. శ్రీ వెంకట హనుమాన్ ట్రేడర్స్, వెంకటేశ్వర జనరల్ ట్రేడర్స్ దుకాణాల్లో స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి సోదాలు నిర్వహించారు. అనుమతుల్లేని, నిషేధించిన వివిధ రకాల సిగరెట్లను గుర్తించారు. దీంతో రూ.6.77 లక్షల ఖరీదు చేసే వివిధ బ్రాండ్‌ల సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ నిర్వాహకులు దరివేముల రామారావు, ఓరుగంటి శ్రీనివాసరావు ఇళ్లల్లోనూ తనిఖీలు చేపట్టారు. వీరిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మాచర్ల పట్టణ పోలీస్ అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, రెవిన్యూ, ఐటీసీ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

మాది కుటుంబ గొడవ

- మంత్రి విడదల రజినికి ఎలాంటి సంబంధం లేదు
- నా సోదరుడు డబ్బులు ఇవ్వాల్సి ఉంది
- అడగడానికి వెళితే దౌర్జన్యం చేశారు
- చందవరం బాధితుడు గొంటు జయభరత్‌రెడ్డి


ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతున్న గొంటు జయభరత్‌రెడ్డి

చిలకలూరిపేట: తమది పూర్తిగా కుటుంబ వివాదమని, ఈ వ్యవహారంతో మంత్రి విడదల రజినికి ఎలాంటి సంబంధం లేదని చందవరం గ్రామానికి చెందిన గొంటు జయభరత్‌రెడ్డి స్పష్టం చేశారు. నాదెండ్ల మండలం చందవరం గ్రామంలో ఈ నెల 20వ తేదీన అన్నదమ్ములు జయభరత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి మధ్య ఘర్షణ జరిగిన విషయం విదితమే. ఇందులో ఇరువర్గాలకు గాయాలయ్యాయి. జయభరత్‌రెడ్డి కుటుంబసభ్యులు చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో జరిగిన గొడవ పూర్తిగా తమ కుటుంబ అంతర్గత వ్యవహారమని చెప్పారు. గ్రామంలో గతంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు తన సోదరుడు శ్రీనివాసరెడ్డి తనకు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఆ డబ్బులు అడిగేందుకు వెళ్లినందుకే తన భార్య గొంటు సామ్రాజ్యంతోపాటు తన కుమార్తెపై దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన కుటుంబ సభ్యులపై మూకుమ్మడి దాడికి పాల్పడటంతో తాను ఆత్మరక్షణ కోసం గొడవ పడాల్సి వచ్చిందని వెల్లడించారు. ఈ విషయంలో మంత్రి రజినికి ఎలాంటి ప్రమేయం లేదని పేర్కొన్నారు. కావాలని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఆమె పేరును వాడుతున్నారని అన్నారు. దీనికి తోడు సొలస గ్రామానికి చెందిన బీవీరెడ్డి మా కుటుంబ వ్యవహారంపై మాట్లాడటం సముచితం కాదన్నారు. బీవీ రెడ్డి గురించి ఆరా తీస్తే అతను కూడా జనాల వద్ద డబ్బులు వసూలు చేసి ఇబ్బందులు పెడుతున్న వ్యక్తిగా తేలిందని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులు వారి స్వలాభం కోసం మంత్రిపై విమర్శలు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తి బీవీరెడ్డి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. మంత్రి విడదల రజినిని అడ్డంపెట్టుకొని పదవులు పొంది జనాలను మోసం చేసే వారు విమర్శలకు దిగడం సరికాదన్నారు. శ్రీనివాసరెడ్డి పార్టీ నాయకుడిని అని చెప్పుకుంటూ గ్రామంలో చేసిన దౌర్జన్యాల ఫలితంగా గతంలో టీడీపీకి ఓట్లే లేని గ్రామంలో ఆ పార్టీకి మనుగడ ఏర్పడిందని విమర్శించారు. తన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు.

హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూలు అడ్మిషన్ల కోసం సంప్రదించండి

నరసరావుపేట:స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్‌లో 14వ బ్యాచ్‌కు ప్రవేశాలు జరుగుతున్నాయని డిపో మేనేజర్ బి.వీరాస్వామి మంగళవారం తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో లైట్ లైసెన్స్ కలిగి హెవీ లైసెన్స్ పొందగోరే డ్రైవర్లు డ్రైవింగ్ స్కూల్‌లో ప్రవేశాలకు సంప్రదించాలని కోరారు. ఒక్కో బ్యాచ్‌కు కేవలం పరిమితంగా 16సీట్లే ఉన్నందున అభ్యర్థులు త్వరపడాలని కోరారు. వివరాలకు 9959225428, 7382896038 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన సేవలు అందించాలి

సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్ విక్టర్ ఇమ్మానియేల్

చిలకలూరిపేట: వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి ఎస్ విక్టర్ ఇమ్మానియేల్ చెప్పారు. పట్టణంలోని సుబ్బయ్య తోటలో ఉన్న ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రంలో మంగళవారం విద్యుత్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. వినియోగదారులకు అందించే సేవలపై ఎలాంటి ఫిర్యాదులు అందినా సదరు సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 25 మంది వినియోగదారుల నుంచి రాతపూర్వకంగా సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించినట్లు విద్యుత్ ఈఈ చల్లా రమేష్ తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్ ద్వారా రూ.2.5 లక్షల మేరకు వినియోగదారులకు లబ్ధి చేకూరినట్లు ఆయన వెల్లడించారు. ఏపీ సీపీడీసీఎల్ సీఆర్‌డీఏ ఎస్ఈ పి విజయకుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఆర్ అశోక్ కుమార్, ఎ గురునాథం, విద్యుత్ అదాలత్ సభ్యులు సునీత, వెంకటకృష్ణ, విద్యుత్ ఏఈలు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై స్కూటీ దగ్ధం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే ముత్యాలంపాడులో నడిరోడ్డుపై ఓ స్కూటీ మంగళవారం దగ్ధమైంది. ఆంధ్ర ప్రభ కాలనీ తోటవారి వీధికి చెందిన మొదలి కృష్ణమోహన్ ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తు న్నారు. ఆయన మంగళవారం తన స్కూటీపై ఆస్పత్రికి బయలుదేరారు. ముత్యాలంపాడు వచ్చే సరికి వాహనం నుంచి పొగ వచ్చింది. దీంతో భయపడిన ఆయన రోడ్డుపైనే స్కూటీని ఆపి పరిశీలిస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. క్షణాల్లో స్కూటీ పూర్తిగా దగ్ధమైంది.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 24లోపు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, ఏపీ రెసిడెన్షియల్, సాంఘిక, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఎంఈవోలకు, డివిజన్ స్థాయిలో హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు తమ దరఖాస్తులను డీవైఈవోలకు అందజేయాలని సూచించారు.

పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్ స్మృతివనం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్ స్మృతివనం పనులు చేపడుతున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. నగరంలోని స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ స్మృతివనం నిర్మాణ పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. స్మృతివనం పనులను సీఎం వైఎస్ జగన్, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ పలు సూచనలు చేస్తున్నారన్నారు.

డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మాణపు పనులు దాదాపు పూర్తయ్యాయని, లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటెన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ సుందరీకరణ తదితర పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. మిగిలిన నిర్మాణ పనులను రానున్న రెండు నెలల్లో పూర్తిచేసి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. అధికారులందరూ కూడా బాధ్యతగా పనిచేయాలని అన్నారు. పనులు పరిశీలన వారిలో ఏపీఐఐసీ చీఫ్ ఇంజినీర్ నరసింహారావు, జోనల్ మేనేజర్ సీతారాం, డెప్యూటీ జోనల్ మేనేజర్ రహీమ్, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వాసుదేవరావు, ప్రాజెక్ట్ మేనేజర్లు కె.కృష్ణమోహన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీరుపై కత్తితో దాడి


గాయపడ్డ వలంటీరు గోపి

పిడుగురాళ్ల: వలంటీరుపై పలువురు వ్యక్తులు పథకం ప్రకారం మూకుమ్మడి దాడి చేసి కత్తితో విచక్షణారహితంగా తలపై దాడిచేసిన సంఘటన పట్టణంలోని జానపాడు రోడ్డులో రైల్వే గేటు సమీపంలో మంగళవారం జరిగింది. పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణం 10వ వార్డు 5వ సచివాలయ పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న తోడేటి గోపికి, జానపాడు వంశీ అనేవ్యక్తికి మధ్య వాట్సాప్ స్టేటస్ విషయమై సామాజిక మాధ్యమం వేదికగా ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. చివరికి వలంటీరు గోపి ఒంటరిగా ఉన్న సమయంలో వంశీతోపాటు మరికొందరు వ్యక్తులు కొబ్బరి బొండాలు నరికే కత్తితో దాడి చేశారు. దీంతో గోపి తలపై సుమారు 12 చోట్ల గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడు గోపిని పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలంలో కొబ్బరి బొండాలు నరికే కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

సృజన

హ్యాపీ స్పేస్


● భార్గవి

యాంత్రిక ప్రయాణంలో పోటీ ఎప్పుడూ ఉండేదే! కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు అమ్మ కళ్లలో.. కలల్లో చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది. 'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి. హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి నేచురల్ కలర్స్ వాడకం గురించి అపార్ట్‌మెంట్ పిల్లలకు పరిచయం చేస్తూ కనిపించారు. ఆసక్తితో ఆమె చేస్తున్న పని గురించి ప్రశ్నించినప్పుడు పిల్లల కోసం తను సృష్టించిన సహజ ప్రపంచాన్ని మన ముందుంచారు..

‘‘పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లై, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, పైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్‌తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.



● ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...


● నిశితంగా తెలుసుకుంటూ...

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రైన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి
ఫోటో: మోహనాచారి

న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



–జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందు వల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం


● మాన్య





పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్ళలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లుగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.

బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ళ మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్లు ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లలోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్జీ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వి మేళా, అక్షయ్‌కల్ప్ రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

యూత్ పల్స్

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు

సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...



ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్‌బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్ట్‌లతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటి' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారి పోటర్' సిరీస్‌లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్ట్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రైటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.

'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్– జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్ట్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.

